# సాయానికో చిరునామా

గోరంత సాయం చేసి కొండంత ప్రచారం చేసుకుంటున్న రోజులివి. ఇందుకు భిన్నంగా ఒక సామాన్యుడు ప్రచారానికి దూరంగా ఉంటూ వందల మంది పేద విద్యార్థులకు చేయూతనిస్తూ వారిని ప్రయోజకులుగా మార్చుతున్నాడు. చెన్నైలో అతడు స్థాపించిన 'ముగవరి' సంస్థ సహాయానికి చిరునామాగా మారింది...




భూపతిరాజా ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీసెస్‌లో గ్రూప్ వన్ అధికారి. అతడు 'ముగవరి' సంస్థను కనీసం రోజుకు ఒక్కసారైనా తలచుకుంటాడు... కారణం పేదరికంతో చదువుకు స్వస్తి పలికేస్తున్న తరుణంలో అతడి భుజం తట్టి అంత దూరం తీసుకొచ్చింది ఆ సంస్థే మరి. అతడిలానే ముగవరి నుంచి సాయం పొంది ప్రయోజకులైన డాక్టర్ కస్తూరి, వెట్రివేల్, తామరైసెల్వి లాంటి పేద ప్రతిభావంతులు ఎంతోమంది కనిపిస్తారు. 'ముగవరి' అంటే 'చిరునామా' అని అర్థం. పేరుకు తగ్గట్టుగానే ఆ సంస్థ ప్రస్తుతం 220 మంది పేద విద్యార్థులకు ఆసరా కల్పిస్తున్న చిరునామాగా మారింది. వారికి ఉచితంగా కూడూ గూడూ కల్పించడంతోపాటు వారి చదువుకయ్యే ఖర్చూ భరిస్తోంది. ఈ విద్యార్థులంతా సివిల్స్, మెడిసిన్, బీటెక్, ఎంటెక్, ఎంఎస్సీ, బీఏ, బీకాం తదితర కోర్సులు చదువుతున్నవారే. ప్రతిభ ఉండీ, పేదరికంతో చదవలేకపోతున్న విద్యార్థులను ఈ సంస్థ గుర్తిస్తుంది. పత్రికల్లో వచ్చే వార్తలూ తమ సంస్థకు వచ్చే దరఖాస్తుల ఆధారంగా క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలన చేసి పేద విద్యార్థులను గుర్తిస్తారు. వారిని చెన్నైకి తీసుకొచ్చి వారి ఉన్నత చదువులు పూర్తయ్యే వరకూ భోజన వసతితోపాటు చదువుకయ్యే ఖర్చులూ ఈ సంస్థే భరిస్తుంది. సివిల్స్ పరీక్షల శిక్షణ కోసం డిల్లీకి కూడా పంపుతోంది.

## సామాన్యుడి సంకల్పం

ఇంతమందికి ఇలా సాయం చేస్తున్న ఈ సంస్థను నిర్వహిస్తున్న వ్యక్తి సంపన్నుడేమీ కాదు, ఓ సామాన్య కూలీ కుమారుడు 35 ఏళ్ల కె.రమేష్. అతడి జీవితమే ఓ కష్టాల కడలి. పేదరికంతో అతడి తండ్రి చెన్నైలో కూలీ పనులు చేశాడు. ఉండటానికి నీడ లేక తల్లిదండ్రులతో కలిసి ఫుట్‌పాత్‌లపై నిద్రపోయిన రాత్రులెన్నో ఉన్నాయి. చదువుకు పేదరికం ఎంత అడ్డంకిగా ఉంటుందో చిన్నప్పటి నుంచే రమేష్‌కు బాగా తెలుసు. తనలా పేదరికంలో ఉన్న విద్యార్థులకు సాయం చేయాలని అనుకున్నాడు. ఒకవైపు సీఏ చేస్తూనే తనకు తెలిసిన పేద విద్యార్థులకు చేతనైనంతలో భోజనం, వసతి కల్పించేవాడు, అదిప్పుడు ముగవరి సంస్థగా మారి ఎందరికో ఆశ్రయం కల్పిస్తోంది. అతడిలో ఈ స్ఫూర్తి కలిగించింది ఒక అమ్మాయి. రమేష్ సొంతూరు సేలం జిల్లా ఆత్తూరులో కస్తూరి అనే పేద విద్యార్థిని చదువులో దిట్ట. ఇంటర్మీడియెట్‌లో 90 శాతానికిపైగా మార్కులు సాధించిన ఆమెకు డాక్టర్ కావాలన్నది కల. అందుకు పేదరికం అడ్డుగా ఉండేది. మెడిసిన్ బదులు టీచర్ ట్రైనింగ్ చేస్తే తొందరగా ఉద్యోగం వస్తుందని రమేష్ ఆమెకు సలహా ఇచ్చాడు.

'డాక్టర్ అవుతావని నన్ను దీవించిన నువ్వే ఇప్పుడిలా అంటున్నావేంటి అన్నా' అని అడిగింది దిగులుగా. ఆ మాటలు అతని గుండెలోతులను తాకాయి. ఆమెను ఎలాగైనా మెడిసిన్ చదివించాలనుకుని మిత్రుల సాయంతో దర్శకుడు మురుగదాస్‌ను కలిసి ఆమెకు సాయం చేయమని కోరాడు. అందుకు ఆయన అంగీకరించాడు. ఇప్పుడు కస్తూరి మెడిసిన్ పూర్తి చేసి ఆప్తల్మాలజీలో పీజీ చేస్తోంది. తన ప్రయత్నాన్ని ఒక్క కస్తూరితోనే ఎందుకు ఆపేయాలి అనుకున్న రమేష్ 'ముగవరి'ని స్థాపించి పేద విద్యార్థులకు సాయం చేయడం మొదలుపెట్టాడు.

## మొదట్లో చాలా ఇబ్బందులు

ఆరంభంలో అన్నీ ఒడుదొడుకులే. అసలే తాను పేదవాడు, తనకే కష్టంగా ఉంటే ఇతరులకు సాయం చేయడం మరింత కష్టంగా ఉండేది. అయినా రమేష్ తన సంకల్పాన్ని వీడలేదు. ఒక అద్దె ఇల్లు తీసుకుని తనతోపాటు ఓ పది మంది పేద విద్యార్థులకు ఆశ్రయం, ఉచిత భోజన వసతి కల్పించేవాడు. అందుకు నెలకు 15వేల రూపాయలు ఖర్చు అయ్యేవి. అతడి మిత్రులు కొంతమంది సాయం చేసేవారు. అలా ముగవరి ప్రస్థానం మొదలైంది. రమేష్ సేవలు చూసి ముగ్ధుడైన చెన్నై మేయర్ వేళచ్చేరిలోని తన సొంత కల్యాణ మండపంలో కొంతభాగాన్ని ఆ సంస్థకు కేటాయించి విద్యార్థులకు అక్కడే ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తున్నారు.

ముగవరి నుంచి ఇప్పటికే 30 మంది ఉన్నత చదువులు పూర్తి చేసి పెద్దపెద్ద ఉద్యోగాల్లో చేరారు. వారు తమ వేతనంలో ఏడు శాతం సంస్థకు ఇచ్చి మిగిలిన పేద విద్యార్థులకు సాయపడేలా 'వానవిల్' (ఇంద్ర ధనుస్సు) కార్యక్రమాన్ని చేపట్టారు. కొందరు దాతలు విద్యార్థులను దత్తత తీసుకుని వారి చదువుకయ్యే ఖర్చు భరిస్తున్నారు. ముగవరి గురించి తెలిసిన అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం రమేష్‌ను ప్రత్యేకంగా రాష్ట్రపతి భవన్‌కు పిలిపించుకుని మరీ అభినందించారు. ఇంత సేవ చేస్తున్నా రమేష్ ఎప్పుడూ మీడియా ముందుకు రాడు, ఎక్కడా తన ఫొటో ఉండటానికి ఒప్పుకోడు. 'నేనెవరనేది ముఖ్యం కాదు, పేదవారికి సాయం అందుతుందా లేదా అనేదే ముఖ్యం' అంటాడతడు.

'నా ప్రయత్నం అలా నిరంతరంగా సాగిపోతూ పేద విద్యార్థులకు ఆసరా కల్పించే ఓ శాశ్వత చిరునామాగా ముగవరి మారాలన్నదే నా ఆశయం' అంటున్న అతడి కల నెరవేరాలని కోరుకుందాం...! ★

